రౌడీ షీటర్‌కు 6 సంవత్సరాల జైలు శిక్ష

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటనలో ములకులపల్లి నూకరాజు(45)కు 06 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5,000/- జరిమానా విధిస్తూ 8వ ఏడిజే కోర్టు న్యాయమూర్తి ఎస్.కవిత తీర్పు వెలువరించారు.

వివరాలలోకి వెళ్తే, 2021వ సంవత్సరంలో న్యూ పోర్టు పరిధిలో జరిగిన ఘటనపై ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు తన స్నేహితులతో కలిసి బస్సు కాంప్లెక్స్ పక్కన మాట్లాడుతుండగా నిందితుడు ములకులపల్లి నూకరాజు కత్తితో అతని వద్దకు వచ్చి దాడి చేసి, నుదిటిపై కత్తితో గాయపరచి మొత్తం కుటుంబాన్ని చంపేస్తానని తీవ్రంగా బెదిరించి, అక్కడి నుండి పారిపోయిన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, న్యాయస్థానంలో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఈ తీర్పును విధించింది.

రోడ్డు మధ్యలో గొయ్యి

వాహనదారుల ఇక్కట్లు నిత్యం ప్రమాదాలు

విశాలాంధ్ర - ఆనందపురం: వాహనదారులు తరచు ప్రయాణం సాగించాలంటే రోడ్లు బాగుండాలి. రహదారులు బాగుంటే గమ్యస్థానాలకు నిర్దేశ సమయంలో చేరడానికి అవకాశం ఉంటుంది. అలా కాకుండా రోడ్డు పాడైపోయి మధ్యలోనే గోతులమయంగా మారితే సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది. చిన్నపాటి వర్షాలకి ఎక్కడపడితే అక్కడ రోడ్లన్నీ గోతుల్లా మారాయి, కొన్నిచోట్ల భారీ స్థాయిలో గుంతల్లా ఏర్పడి నీటితో దర్శమిస్తున్నాయి. ఆనందపురం బోని రహదారి గోతులమయంగా మారింది. నిత్యం ప్రయాణాలు చేసే వాహనదారులు తరచు ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. రోడ్ల మధ్యలోనే గొయ్యిలు ఏర్పడి నీటి గుంతలు ఉన్నాయి. రాత్రివేళ అయితే చాలా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుప్రక్కల సరైన వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది. జీవీఎంసీ ఆధీనంలో ఉన్న రోడ్డు పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచుకోలేదు. శుభశ్రీ ఫంక్షన్ హాల్ మలుపు వద్ద, పొడుగు పాలెం బారికివారి కల్లాలు, చందక స్మశానం వద్ద, తాడి కల్లాలు పలుచోట్ల రోడ్డు గోతులమయంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు ఎటువంటి మార్పు రాలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు మధ్యలో ఉన్న గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మిట్టల్ స్టీల్‌కు సేవ ఆపండి... విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించండి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రభుత్వాలు ఆర్సెలార్ మిట్టల్‌కు సేవ చేయడం నిలిపివేసి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.జగ్గు నాయుడు, విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వి కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిఎస్‌జె అచ్యుతరావు, ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు అనకాపల్లి జిల్లా ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌పై చూపిస్తున్న తపన విశాఖ స్టీల్ ప్లాంట్‌పై చూపకపోవడం ప్రజలను వంచించడమే అన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం సొంత గనులు కేటాయించిందని, చివరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఇంకా పరిశ్రమే ఏర్పాటు కాని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు కూడా సొంత గనులు కేటాయించాలని విశాఖ ఎంపీ శ్రీ భరత్‌తో సహా, రాష్ట్ర టీడీపీ ఎంపీలు కేంద్ర ఉక్కు శాఖామంత్రిని కలవడం, మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు మంజూరు చేసినట్లు బిజెపికి చెందిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ప్రకటించడం, నేడు మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకోవడం ఆఘమేఘాల మీద జరిగిపోయాయన్నారు. సొంత గనులు లేక విశాఖ ఉక్కు ప్రతి టన్ను ఉక్కు ఉత్పత్తికి నాలుగు వేల రూపాయలు అదనపు ఉత్పత్తి ఖర్చు భరించాల్సి వస్తోందన్నారు. కార్మికులు అధికంగా ఉన్నారని దశాబ్దాల తరబడి పనిచేస్తూ అత్యంత నైపుణ్యం సాధించిన ఐదువేల మంది కాంటాక్ట్ కార్మికులను చట్టవిరుద్ధంగా అమానుషంగా తొలగించారన్నారు. వీరి స్థానంలో అనుభవం లేని ఇతర రాష్ట్రాల

కార్మికులను విధుల్లోకి తీసుకొని పనిచేయిస్తున్నారని, కార్మికుల అధికమైతే ఇతర రాష్ట్రాల వారిని ఎందుకు తీసుకుంటున్నారని దీనిని విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యే ఆపడం లేదన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించే వరకు మిట్టల్ స్టీల్ ప్లాట్‌కు గనులు కేటాయించరాదని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె.దేవ సహాయం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పడాల రమణ, సిఐటియు జిల్లా నాయకులు బి.జగన్, ఎస్.జ్యోతీశ్వరరావు, కేఎం కుమార మంగళం, ఎం.సుబ్బారావు, వై.రాజు, టి.నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో దుర్గమ్మ భక్తులకు అన్న ప్రసాదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణంలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారి దసరా నవరాత్రి మహోత్సవంలో భాగంగా జీవీఎంసీ ఉద్యోగుల సహకారంతో శనివారం జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, 3వ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ ల చేతుల మీదుగా భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్లు మాట్లాడుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల సహకారంతో శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా మహోత్సవ కార్యక్రమాలు ప్రతీ ఏటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఉద్యోగుల సహకారంతో భక్తులు అన్న ప్రసాదం అందించడం జరిగినదని, దుర్గమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరి పై ఉండాలని, దుర్గ అమ్మవారు అన్నివేళలా తమ భక్తులను కాపాడుతుందని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని జీవీఎంసీ ఉన్నతాధికారులు, అధికారులు ఉద్యోగులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి కమిటీ సభ్యులు ఓమ్మి సురేష్, జగన్, రాజేష్, ప్రకాష్, భాస్కర్, అప్పలరాజు, తదితర జివిఎంసి ఉద్యోగులు పాల్గొన్నారు.

అబ్బురపరచిన క్రీడలు

రెండవ రోజు అసెంట్ పాఠశాలలో జరిగిన చౌక్‌బాల్ పోటీలకు హాజరైన ఇండియన్ క్రికెటర్ కెఎస్.భరత్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం అసెంట్ స్కూల్‌లో జరుగుతున్న 16వ జాతీయ జూనియర్ చౌక్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పలు రాష్ట్రాల నుండి బాయ్స్ 16 టీంలు, గర్ల్స్ 10 టీంలు పాల్గొన్నాయి. ఆటగాళ్లకు ప్రోత్సాహం అందించడానికి ఇండియన్ క్రికెటర్ కె.ఎస్.భరత్ హాజరై, గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ స్థాయి టోర్నమెంట్ నిర్వహించినందుకు స్కూల్ యాజమాన్యాన్ని, కోచ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. యువతకు ఇలాంటి క్రీడా అవకాశాలు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ శంకర్రావు మాట్లాడుతూ లీగ్ దశలో 42 టీంలు పోటీపడగా, క్వార్టర్ ఫైనల్స్ పూర్తయినట్లు తెలిపారు. నేడు సెమీఫైనల్స్, ఫైనల్స్ ముగిసిన తరువాత మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రధాన అతిథిగా హాజరై శాసనసభ్యులు చేతుల మీదుగా గెలుపొందిన జట్లకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారని తెలిపారు.

కండిపిల్లి వీధిలో దసరా నవరాత్రులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 75వ వార్డు కండిపిల్లి వీధిలో కొలువై ఉన్న శ్రీ కనక దుర్గా అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గాజువాక నియోజక వర్గ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సతీమణి లావణ్య ఐదవ రోజు శ్రీ మహాలక్ష్మీ అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనాలతో స్థానిక మహిళల స్వాగత సత్కారాలతో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు కండిపిల్లి రమణ, దొమ్మేటి పెరుమాళ్, పెద్దాడ సోము నాయుడు, కాకినాడ అప్పల రాజు, దొమ్మేటి సోము నాయుడు, తమ్మయ్య రెడ్డి, చౌదరి పాల్గొన్నారు.

అంతర్జాతీయ పర్యాటకానికి చిరునామా విశాఖ

ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: డొమెస్టిక్ పర్యాటకంతోపాటు, అంతర్జాతీయ పర్యాటకానికి చిరునామాగా విశాఖను తీర్చిద్దేందుకు అవిరళ కృషి చేస్తున్నామని, ఇప్పటికే ఎన్నో రకాల అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పలు అంశాలపై మాట్లాడారు. విశాఖను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని, పర్యాటకానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. డబుల్ డెక్కర్ బస్సు, యూహెచ్3హెచ్ మ్యూజియం, యాత్రీ నివాస్ పునఃప్రారంభం తదితర నూతన ప్రాజెక్టులను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే విధంగా బీచ్ కారిడార్లో పలు రకాల వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విశాఖ కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిసారించిందని, జిల్లా యంత్రాంగం కూడా తదనుగుణంగా చర్యలు చేపడుతోందని వివరించారు. రెండు మూడు సంవత్సరాల్లో పర్యాటకంగా వినూత్న ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయని, విశాఖ రూపురేఖలు మరింత మారిపోతాయని పేర్కొన్నారు. రానున్న కాలంలో విశాఖ కేంద్రంగా పలు విశేష కార్యక్రమాలు జరుగుతాయని వాటిలో భీమిలి ఉత్సవ్, విశాఖ ఉత్సవ్ ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. వచ్చే ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ, విశాఖ పరేడ్ జరుగుతాయన్నారు. ఇటీవల జరిగిన ఫుడ్ ఫెస్టివల్ మాదిరిగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల నిర్వహించిన వీడియో, ఫోటోగ్రఫీ పోటీల్లో విజేతలకు, వివిధ వేదికల కళాకారులను, హోటల్, మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులను, రక్తదాతలను కలెక్టర్ అభినందించారు. వీడియోగ్రఫీ పోటీల్లో ప్రథమ స్థానంలో అన్మోల్ నిలవగా, ద్వితీయ స్థానంలో కిరణ్ తుమ్మల, తృతీయ స్థానంలో నివేదిత నిలిచారు. ఫోటో గ్రఫీ పోటీల్లో ప్రథమ స్థానంలో దీపక్, ద్వితీయ స్థానంలో మోనిక, తృతీయ స్థానంలో నవాజ్ నిలిచారు. వీరికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఫోటోగ్రఫీలో భార్గవ్ రాజు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని చిల్డ్రన్ ఎరీనా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. 100 మంది దాతలు రక్తదానం చేసి స్ఫూర్తిని నింపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి, డీవీఎం జగదీశ్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా కళాశాల విద్యార్థులకు దసరా ఇంటర్న్‌షిప్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలోని కస్తూరిబా కళాశాల విద్యార్థులకు దసరా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తి విద్య ఉపాధ్యాయురాలు బి.స్వరాజ్యం ఆనందపురం మండలంలోని వేములవలస జంక్షన్‌లో శ్రీ బాలాజీ స్వీట్స్ బేకరీ వద్ద విద్యార్థులను తీసుకొని వెళ్లి రొట్టె, కుకీస్, కేకులు, పేస్ట్రీ తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చంద్రశేఖర్, జిసిడిఓ శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.లావణ్య, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ చైర్మన్ మంగా అప్పన్న పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర పరిధిలో గల ఇసుక తోట పెట్రోల్ బంక్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన 3వ జోన్ 22వ వార్డు పరిధిలోని ఇసుకతోట జంక్షన్ ఐఓసీ పెట్రోల్ బంక్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ కమిషనర్ ఇసుకతోట పెట్రోల్ బంకు వద్ద నేషనల్ హైవే ప్రధాన రోడ్‌లో అధికంగా ప్రజలు, వాహనాల రాకపోకలు ఉంటాయని, అక్కడ నిర్మిస్తున్న కల్వర్టు పనులు ఎందుకు మంద కొడిగా సాగుతున్నాయని ఆరా తీస్తూ, కల్వర్టు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కార్యనిర్వాహక ఇంజినీరు గంగాధర్ ను ఆదేశించారు. నిర్మిస్తున్న కల్వర్టు పొడవు, వెడల్పు, లోతు పనులను స్వయంగా పరిశీలించారు. మురుగు నీరు సాఫీగా పోయే విధంగా, అలాగే వర్షాలు సంభవించినప్పుడు అడ్డంకులు ఏర్పడకుండా సాఫీగా నీరు పారే విధంగా ప్రణాళికాయుతంగా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కల్వర్టు నిర్మాణ పనుల పై పూర్తి అవగాహన కలిగి నిత్య పర్యవేక్షణ జరపాలని సహాయక ఇంజనీరును ఆదేశించారు. ప్రమాదాలు జరుగకుండా ప్రజలు, వాహనదారుల అవగాహన కొరకు "జీవీఎంసీ వర్క్ ఇన్ ప్రోగ్రెస్" బోర్డులను కల్వర్టు పనుల నిర్మాణం వద్ద వెంటనే ఏర్పాటు చేయాలని కార్యనిర్వాక ఇంజనీర్ గంగాధర్ ను కమిషనరు ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఉపకార్యనిర్వాహక ఇంజనీరు నాయుడు, సహాయక ఇంజనీరు, ఎమినిటీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో దసరా సంబరాలు

విశాలాంధ్ర - పద్మనాభం: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించినారు. వివిధ విభాగాల వారు దేవీపూజను ఘనంగా జరిపి, దుర్గమ్మవారిని దేదీప్యమానంగా పూలమాలలతో అలంకరించి, నైవేద్యములను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారి వేషధారణతో అలాగే అచ్చమైన తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు వెల్లి విరిసేటట్లుగా వస్త్రాలను ధరించి, నృత్యాలను చేసి విద్యార్థులు కేరింతలు చేశారు. కళాశాల ఆవరణలో దేవీ నవరాత్రుల సందర్భంగా రంగోలి, దాండియా, మెహందీ, తెలుగు సాంప్రదాయ కట్టుబాట్లు వంటి కార్యక్రమాలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. దసరా నవరాత్రి ఉత్సవాలు యొక్క ప్రాముఖ్యతను వివరించి వాళ్ళలో సంస్కృతి గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డా. ఎ.చంద్రశేఖర్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. సరీఫ్, అలాగే వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యధావిధిగా వ్యాపారాలు చేసుకోనివ్వకపోతే ఉద్యమిస్తాం

ఏఐటీయూసీ నాయకులు వై.రాంబాబు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీలో అన్యాయంగా షాపులు తొలగించి పేదలకు కడుపుమంట రగిల్చారని ఏఐటీయూసీ నాయకులు వై.రాంబాబు విమర్శించారు. యధావిధిగా చిరువర్తకులను వ్యాపారాలు చేసుకోనివ్వకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి సింహాద్రి నగర్లో చిరువ్యాపారస్తులు బి.దామోదర్ రావు, కె.నాగార్జున, ఈ.విజయలక్ష్మి, పి.విశాల్ తదితరులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు అత్యుత్సాహం వలన ఆర్థికంగా, మానసికంగా నష్టపోయామని వారు రాంబాబుకు వివరించారు. రోజు వారి ఫైనాన్స్‌లు తీసుకొని వ్యాపారాలు నిర్వహించుకుంటున్నామని, ప్రస్తుతం వ్యాపారాలు కూల్చేయడం వలన ఫైనాన్స్ వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వెలిబుచ్చారు. మరో వైపు పిల్లలకు దసరా పండుగ నిర్వహించుకోలేని దీన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రాంబాబు మాట్లాడుతూ అధికారులు చెప్పినట్టు హాకర్ జోన్ ఏర్పాట్లు సంతోషకరమైన విషయం అయినప్పటికీ అంత త్వరగా సాధ్యం కాదని అప్పటి వరకు వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. అనంతరం నాయుడు తోట గుడివద్ద స్టాండింగ్ కమిటీ సభ్యులు, 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి వర ప్రసాద్ (కన్నా)ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, నాగరాజు, కుమారి, శరత్, దిలీప్ తదితరులున్నారు.

దుర్గాదేవికి బెహర ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు నందమూరి నగర్‌లో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రులలో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి అన్న సమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధవళ గోపాల్, నీలాపు మహాలక్ష్మి రెడ్డి, బండారు నాగేశ్వరరావు, ధవళ మోహన్, నమ్మి రమణ, కరణం కన్నారావు, నర్సింగరావు, కోరుకొండ రాజు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం... భూకబ్జాకు యత్నం...

ఎమ్మార్వో ఆదేశాలు బేఖాతరు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వ రికార్డుల ప్రకారం కాపులుప్పాడలోని 350/12సిలో 29 సెంట్లు భూమి కాయిత అప్పన్న పేరు మీద ఉంది. ఆన్‌లైన్‌లో కూడా అతని పేరు కనిపిస్తుంది. భీమిలి ఎమ్మార్వో కాయిత అప్పన్న వారసులకే ఈ భూమిపై హక్కు వుందని, ఈ స్థలంలోకి వేరే ఎవరూ వెళ్ళకూడదని స్పష్టమైన నివేదిక ఇచ్చారు. దశాబ్దాల కాలంగా ఈ భూమి వారి వారసుల ఆధీనంలోనే ఉంది. గత కొంతకాలంగా ఓ వ్యక్తి ఈ భూమి నాది అని చెప్పి ప్రతిసారి వివాదం సృష్టిస్తుండడంతో కాయిత అప్పన్న కుమారుడు కాయిత శ్రీనివాస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతి అందించారు. ఈమేరకు భీమిలిపట్నం ఎమ్మార్వో సర్వే చేసి నివేదిక ఇచ్చారు. ఈ స్థలం కాయిత అప్పన్నకే చెందుతుందని, ఆ స్థలంలోకి ఇతరులు ఎవరికి సంబంధం లేదని, వారసత్వంగా వస్తున్న వారి వారసులకే చెందుతుందని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత కొంతకాలంగా ఈ స్థలంపై కన్నేసిన దినేష్ రాజు అనే వ్యక్తి ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇతనిపై పోలీస్ స్టేషన్లో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. భీమిలి పోలీసులు అతన్ని పిలిచి ఆ స్థలంలోకి వెళ్ళడానికి వీలులేదని బైండోవరు రాయించారు. పోలీసుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ ఇటీవల ఆ స్థలంలో కంటైనర్ ఏర్పాటు చేశారు. ఎమ్మార్వో ఉత్తర్వులు అతిక్రమిస్తే కబ్జా కేసు పెడతామని హెచ్చరించారు. అయినా ఎవరి మాటా ఖాతరు చేయలేదు. మాజీ మంత్రి, ప్రస్తుత సీనియర్ ఎమ్మెల్యే అనుచరుడు మద్దతుతోనే కంటైనర్ ఏర్పాటు చేశారని, ఇది సత్యమని కాయిత అప్పన్న కుమారుడు విలేకరులకు వెల్లడించారు. తాము నిజమైన వారసులమని, దినేష్‌కు ఈ ప్రాంతంలో స్థలం లేదని, మమ్మల్ని ఇబ్బంది పెట్టేందుకే ఇలా చేస్తున్నాడని వాపోయారు. పోలీసులు తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారసులు కోరుతున్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ పాత డెయిరీ ఫారం సమీపంలోని వెటర్నరీ కాలనీలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో శనివారం అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 250 మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి శనివారం ఆలయంలో దాతలు సహాయంతో అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేస్తున్నారు.

ఈ శనివారం అన్నదానానికి పెద్ద సంఖ్యలో భవానీ భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు చిలకపాటి రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



మురుగు నీటి కాలువలు నిర్మించండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రజల సౌకర్యార్థం మురుగునీటి కాలువల నిర్మాణం పనులు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 6వ జోన్ 70, 87 వార్డులలో పర్యటించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ 70వ వార్డులోని టీవిఎన్ కాలనీలో నాలుగు వీధులకు సంబంధించి కాలువలు లేక మురుగు నీరు పోయే మార్గం లేనందున ఆ ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. నాలుగు వీధులకు సంబంధించి మురుగు నీరు ఆ ప్రాంతంలో గల ఒక నివాసితుని ప్రైవేట్ స్థలము వద్ద అడ్డంకి ఏర్పడడం వలన నివాసితుల నివాసాల ముందు మురుగునీరు నిలిచిపోతుందని, తద్వారా బోరు నీరు కలుషితమవుతుందని, దోమలు అధికంగా వృద్ధి చెంది అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, కమిషనర్ స్పందిస్తూ, మురుగు నీరు ప్రైవేట్ వ్యక్తి స్థలం మార్గం ద్వారా ప్రధాన కాలువకు వెళ్ళవలసిన అవసరం ఉన్నందున ఆ స్థలం గుండా వెంటనే కాలువ నిర్మాణం చేపట్టి ప్రధాన కాలువకు అనుసంధానం చేసి ఆ కాలనీలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మురుగునీరు సాఫీగా పారేలా కాలువ నిర్మాణం చేపట్టాలని జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి కి కమిషనర్ ఆదేశించారు. అలాగే ప్రైవేటు వ్యక్తి స్థలంలో కాలువ నిర్మాణం చేపడుతున్నందున ప్రత్యామ్నాయంగా ఆ స్థల యజమానికి ఇప్పటికే ప్రతిపాదించిన టిడిఆర్ జారీ ప్రక్రియకు సంబంధించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సిటీ ప్లానర్ మీనా కుమారికి కమిషనర్ ఆదేశించారు. అనంతరం కమిషనర్ 87వ వార్డు సిద్దార్థ నగర్‌లో నున్న జీవీఎంసీ 12 ఎమ్.ఎల్.డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ బొండా జగన్నాథంతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ మీనా కుమారి, డిసిపి వెంకటేశ్వరరావు, ఎసిపి వెంకట్రావు, సహాయక వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్స్‌లో
రోబోటిక్ కార్డియాక్ బైపాస్ సర్జరీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా రోబోటిక్ సహాయంతో కరోనరీ ఆర్టరీ బైపాస్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసినట్లు విశాఖపట్నం కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్ తెలిపారు. ఈ అత్యాధునిక రోబోటిక్ బైపాస్ సాంకేతికత ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు విశాఖపట్నం ప్రజలు తమ స్వంత నగరంలోనే ఈ అత్యాధునిక చికిత్సను పొందగలరన్నారు. ఈ శస్త్రచికిత్సను 54 ఏళ్ల రోగిపై చేశామన్నారు. సాధారణ పరీక్షలలో అయనకు ట్రిపుల్ వెసెల్ డిసీజ్ తో కరోనరీ ఆర్టరీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారించామని, సతీష్ కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉండటంతో ట్రెడ్‌మిల్ టెస్ట్ చేయించగా పాజిటివ్‌గా రావడంతో కరోనరీ యాంజియోగ్రామ్ చేశామన్నారు. మూడు ప్రధాన కరోనరీ ధమనుల్లో తీవ్రమైన బ్లాకేజీలు కనిపించడంతో కేర్కార్డియాక్ టీమ్ రోబోటిక్ సహాయంతో మినిమల్లీ ఇన్వాసివ్ కరోనరీ సర్జరీ చేయాలని సూచించిందన్నారు. ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి రోబోటిక్ సహాయక కార్డియాక్ బైపాస్ శస్త్రచికిత్స విజయాన్ని మా క్లినికల్ బృందం సాధించిందన్నారు. ఈ విజయంతో విశాఖపట్నం కేర్ హాస్పిటల్స్ హై-ఎండ్ కార్డియాక్ కేర్‌కు ప్రాంతీయ రిఫెరల్ హబ్‌గా తన స్థాయిని మరింత బలపరుస్తుందని వరుణ్ తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి నియర్ ఎంఈఎస్ లే అవుట్లో జీవీఎంసీ నిధులు సుమారుగా 39.30 లక్షలు రూపాయలుతో నూతనంగా జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను పెందుర్తి బిజెపి నాయకులు, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముమ్మన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చెయ్యాలని, వాటరింగ్ తప్పనిసరని కాంట్రాక్టరుకు సూచించారు. రోడ్డు సమస్యను పరిష్కరించి నందుకు స్థానిక కోలని ప్రజలు కార్పొరేటర్ ముమ్మన దేముడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ భద్ర, టిడిపి సీనియర్ నాయకులు అయిత ఎర్నిబాబు, సబ్బవరపు ప్రకాష్, బిజెపి 95, 97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, ఉపాధ్యక్షులు పిడివి.ప్రసాద్, బి. వెంకటరావు, అయిత శివ, కోలని ప్రతినిధులు సత్యనారాయణ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025కి విశేషాదరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: సెప్టెంబర్ 22న ప్రైమ్ సభ్యుల కోసం, తక్కిన కస్టమర్ల కోసం సెప్టెంబర్ 23న అందుబాటులోకి వచ్చిన ద అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ అమెజాన్ డాట్ ఇన్‌పై విక్రేతలు, బ్రాండ్ భాగస్వామ్యుల కోసం అత్యంత పెద్ద ప్రారంభాన్ని అందజేసింది. ఈ ఉత్సవం 38 కోట్లకు పైగా కస్టమర్ సందర్శనలను ఆకర్షించింది. 70 శాతంకి పైగా కస్టమర్లు 9 అగ్ర మెట్రోస్‌కు బయట నుండి వచ్చారు. కస్టమర్లు జీఎస్టి ప్రయోజనాలతో ఆనందించారు. అమెజాన్ డాట్ ఇన్ పై అతి తక్కువ ధరలకు 1 లక్షకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం పొందగలిగారు మరియు ఆపిల్, శామ్ సంగ్, వన్ ప్లస్, ఐక్యూఓఓ, సోనీ, హెచ్ పి, ఎల్ జి, హయ్యర్, తెరిచి, మరియు లెవీస్ వంటి అగ్ర బ్రాండ్స్ నుండి స్మార్ట్ ఫోన్లు, ల్యాప్ టాప్స్, టీవీలు, ఫ్యాషన్ మరియు బ్యూటీ, హోమ్ డెకార్, ఉపకరణాలు, ఫర్నిచర్ మరియు కిరాణా సరుకులు సహా శ్రేణుల్లో 30,000కి పైగా కొత్త ఉత్పత్తులు ప్రారంభించబడ్డాయని సౌరభ్ శ్రీవాత్సవ, వైస్ ప్రెసిడెంట్, అమేజాన్ ఇండియా అన్నారు.

విజ్ఞాన విహారలో ఆకట్టుకున్న ఎగ్జిబిషన్



విశాలాంధ్ర - ఆనందపురం: చిన్నారులు ప్రతిభకు అద్దం పట్టే రీతిలో వారిలో సృజనాత్మకను వెలికితీసే ఉత్తమ విజ్ఞాన శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎన్ఐటి ప్రొఫెసర్ జి.రామశాస్త్రి అన్నారు. విజ్ఞాన విహార ఆవాస విద్యాలయంలో జరిగిన ఎగ్జిబిషన్‌కు ఆయన విచ్చేసి మాట్లాడారు. విశాఖ బీవీకే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్న శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, నైతిక విలువలలో కూడిన జీవన విధానం అలవరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఫిజిక్సులో ఆకాష్ స్కేల్ ఆపరేషన్ సిందూర్‌లో ప్రయోగించిన శత్రువులు పన్నాగం పసిగట్టి పరికర నమూనా, గగన యానాం, జల విద్యుత్ - వాయు విద్యుత్, సౌర విద్యుత్ విద్యుత్ ప్రత్యామ్నాయాల నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. అలాగే జీవ శాస్త్రం లో బయో రియాక్టర్ ఆధునిక నీటి పారుదల వ్యవస్థ నమూనా, ఆహారం నిల్వ చేయటం, మాధ్యమిక మహా యాగంలో 20 కోట్లు సం. ముందు జీవరాసులు, టైం ట్రావెల్ గూర్చి నమూనాలను అద్భుత ప్రదర్శన, కెమిస్ట్రీ లో భాగంగా బొగ్గునుండి విద్యుత్ తయారు చేయడం, పాల నుండి ప్లాస్టిక్ తయారు చేయడం, రసాయనిక ప్రక్రియ మూలకాలు నమూనా ప్రదర్శన , మ్యాథమెటిక్స్ విభాగంలో త్రికోణమిలి అర్థిమెటిక్ ప్రోగ్రాం గూర్చి నమూనా ప్రదర్శనలు, భాషా విభాగంలో తెలుగు గ్రామీణ పండుగల సంప్రదాయం విజయనగరం సిరిమాను, కోటప్పకొండ ప్రభలు తిరునాళ్ళు, ఆలయ విశిష్టతగా అయోధ్య, ఒంటిమిట్ట రామాలయం నమూనాలను విద్యార్థులు చాల చక్కగా ప్రదర్శించారు. చిత్ర కళాప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. హిందీ విభాగంలో 1962లో జరిగిన భారత్ చైనా యుద్ధం నమూనా సదమయు కియో అనేమణిపూర్ ఆలయ ప్రదర్శనలు జరిగాయి. ఆంగ్ల విభాగంలో ఆంగ్ల మహిళా రచయిత తోరుదత్ రచించిన ఇతిహాస పాత్రలు సావిత్రి ఏకలవ్యుడు, ధ్రువ మొదలగు ఏకపాత్రాభినయాలు, డ్రామా రోల్ ప్లే విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. డాక్టర్ సతీష్ రామ చౌదరి డీన్ రఘు ఇంజినీరింగ్ కాలేజీ మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలో చదువుకొని ఇంతస్థాయికి వచ్చానని, మీరు జీవితంలో కష్టపడి మంచి స్థాయికి రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బిజెయం రవి కుమార్, డాక్టర్ నితీష్, బాలి రవి, కమిటీ పెద్దలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాచీన విజ్ఞానంలో ఆయుర్వేద గుర్తుగా బాదం వినియోగం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23న, ఆధునిక ప్రపంచంలో ఇప్పటికీ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన జీవన విజ్ఞానాన్ని గుర్తించి, ప్రోత్సహించడానికి జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఒత్తిడి, నిద్ర సమస్యలు, ఆందోళన, బరువు సమస్యలు, మరియు హార్మోన్ల అసమతుల్యత ఆధునిక జీవనశైలిని నిర్వచిస్తున్న తరుణంలో, చాలామంది సంపూర్ణ పరిష్కారాల కోసం ఆయుర్వేదం వైపు మొగ్గు చూపుతున్నారు. ఆయుర్వేద నిపుణురాలు డా. మధుమితా కృష్ణన్, ఆయుర్వేదంలో పాతుకుపోయిన వివిధ పద్ధతులను నేటి వేగవంతమైన ప్రపంచంలో అవి మనకు ఎలా ప్రయోజనం చేకూరుస్తాయో పంచుకున్నారు.

ఆయుర్వేదం మన దినచర్యను ప్రకృతితో అనుసంధానించాలని గట్టిగా సిఫార్సు చేస్తుంది. బ్రహ్మ ముహూర్తం (సూర్యోదయానికి సుమారు గంట ముందు) సమయంలో నిద్రలేవడం ఒకరి ఆయుష్షును పెంచుతుందని, వ్యాధులను నివారిస్తుందని నమ్ముతారన్నారు. ఈ అభ్యాసం స్పష్టత, క్రమశిక్షణ మరియు రోజుకు ఒక తాజా ప్రారంభాన్ని కూడా ప్రోత్సహిస్తుందన్నారు. యోగా దినచర్యలో ఒక అనివార్యమైన భాగమని, ఇది శారీరక మానసిక శ్రేయస్సు రెండింటినీ మెరుగుపరుస్తుందన్నారు.

సామ్సంగ్ గెలాక్సీ గెలాక్సీ ఏ సిరీస్‌పై పండుగ ఆఫర్‌లు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్సంగ్, పండుగ సీజన్‌లో ట్రెండీ స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారుల కోసం గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీకి యువతను ఆకట్టుకునే రంగులను జోడించినట్లు ఈరోజు ప్రకటించింది. గెలాక్సీ ఏ56 5జీ ఇప్పుడు ఆసమ్ పింక్ రంగులో మరియు గెలాక్సీ ఏ36 5జీ ఆసమ్ లైమ్ రంగులో అందుబాటులో ఉన్నాయి, వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అందిస్తున్నాయి. గెలాక్సీ ఏ56 5జీ మరియు గెలాక్సీ ఏ36 5జీతో, సామ్సంగ్ మా ఫ్లాగ్‌షిప్ పరికరాల నుండి అత్యంత ఇష్టపడే ఏఐ ఆవిష్కరణలను ప్రజాస్వామ్యీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పరిమిత కాలం వరకు, కస్టమర్‌లు గెలాక్సీ ఏ56 5జీ మరియు గెలాక్సీ ఏ36 5జీపై జీరో డౌన్ పేమెంట్, జీరో వడ్డీ మరియు జీరో అవాంతరాలను ఆస్వాదించవచ్చు, 5జీ అనుభవాలను గతంలో కంటే మరింత అందుబాటులోకి తెస్తుంది. గెలాక్సీ ఏ56 5జీ ప్రస్తుతం ఆసమ్ ఆలివ్, ఆసమ్ లైట్ గ్రే, మరియు ఆసమ్ గ్రాఫైట్ రంగులలో అందుబాటులో ఉండగా, గెలాక్సీ ఏ36 5జీ ఆసమ్ లావెండర్, ఆసమ్ బ్లాక్, మరియు ఆసమ్ వైట్ రంగులలో అందుబాటులో ఉంది.

డెంగ్యూ రహిత భారత్‌కు డాబర్ ఓడోమోస్ ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - విశాఖపట్నం: డెంగ్యూ మలేరియా నుండి ప్రభావవంతమైన నివారణపై అవగాహనను వ్యాప్తి చేస్తోంది. భారతదేశాన్ని డెంగ్యూ రహితంగా మార్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఓడోమోస్ ఇండియా యొక్క అత్యంత ఇష్టపడే వ్యక్తిగత అప్లికేషన్ దోమల వికర్షక బ్రాండ్ అయిన డాబర్ విశాఖపట్నం ఈరోజు తన మెగా చొరవ చమేకింగ్ ఇండియా డెంగ్యూ రహితం ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ చొరవ కింద, ఓడోమోస్ దేశవ్యాప్తంగా ప్రజలను చేరుకుంటుంది, దోమల కాటు నివారణ గురించి వారికి అవగాహన కల్పిస్తుంది మరియు ఈ వర్షాకాలంలో డెంగ్యూ కలిగించే దోమల నుండి తమను తాము రక్షించుకోవడానికి ఓడోమోస్ దోమల వికర్షక క్రీముల నమూనాలను ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఈ ప్రచారం దేశవ్యాప్తంగా సంఘాలు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను కూడా కవర్ చేస్తుంది. ఈరోజు విశాఖపట్నంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డాబర్, డెంగ్యూ కలిగించే దోమల నుండి ప్రభావవంతమైన నివారణ గురించి వారికి అవగాహన కల్పించడానికి రోజరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి 150 మందికి పైగా విద్యార్థుల మధ్య అవగాహన సెషన్ నిర్వహించింది.